# మంగమ్మగారు - మైక్రో ఓవెన్

"ఆరు నెలలు అమెరికాలో వుండి వచ్చాము. కనీసం ఇంట్లో ఒక మైక్రో ఓవెన్ లేదు. గాంధీనగర్‌లో వున్న అంగటి గంగమ్మగారు అనకాపల్లి తప్ప మరో వూరు చూడకపోయినా వాళ్లింటికెళ్తే ఫ్రిజ్‌లో స్వీట్స్ తీసి మైక్రో ఓవెన్‌లో వేడి చేసి ఇస్తుంది గొప్పగా.." పొద్దునే అసంతృప్తిరాగం ఆలపించింది మంగమ్మగారు.

"అది మైక్రో ఓవెన్ కాదు, మైక్రోవేవ్ ఆవెన్" పేపరు చదువుతున్న మంగపతి నెమ్మదిగా అన్నారు.

"అసలు విషయం వదిలేసి స్పెల్లింగ్ తప్పులు పట్టకండి మాస్టారూ" అంటూ కాఫీ అందించింది.

'అది స్పెల్లింగ్ తప్పు కాదు' అనబోయి సర్దుకుని "కాఫీ బ్రహ్మాండంగా వుంది" అన్నాడాయన మాట మారుస్తూ.

"ఆ మాటే అనబోతున్నా. ఆ మైక్రో మన ఇంట్లో వుంటే నేను లేచి కాఫీ కలిపి ఇచ్చేదాకా మీరు నోరు తెరుచుకు కూర్చోనక్కర్లేకుండా ఇంచక్కా క్షణాల్లో కప్పు కాఫీ కలుపుకుని తాగేయొచ్చుకదా" మంగమ్మగారు పెద్దగా చదువుకోకపోయినా ఆవిడను బుట్టలో పెట్టడం అంత సులువు కాదుమరి.

అందుకే అసలు సంగతి వదల్లేదు ఆవిడ.

"మైక్రో వున్నా మాక్రో వున్నా నీ చేతి కాఫీ తప్ప అమృతం కూడా నాకు నచ్చదుకదే" పొగడ్తను అస్త్రంగా వాడి చూసారు మంగపతిగారు.

"సరే నా చేత్తోనే కలిపి అందులో వేడి పెట్టి ఇచ్చినా అమృతంలాగే ఉంటుంది లెండిగానీ అదేదో స్టార్ కంపెనీ వాడు ఎనిమిది వందలదాకా డిస్కౌంటు ఇస్తున్నాట్ట. అదీకాక టీవీలో టోపీ

పెట్టుకుని వంటలు చేసి చూపిస్తాడే ఆ వంటలన్నీ వున్న పుస్తకం కూడా ఫ్రీగా ఇస్తార్ట." మొగుడి పక్కనే కుర్చీలో సెటిలయింది మంగమ్మ గారు ఈ రోజు అమీతుమీ తేల్చాలన్నట్లు.

మంగపతి గారికి కాఫీ గొంతులో గుటక పడలేదు.

"ఇన్ని విషయాలు ఎక్కడ సేకరించావే? అన్నాడాయన ఆశ్చర్యంగా.

మంగమ్మగారు గర్వంగా చిరునవ్వు చిందించింది.

"మొన్న శుక్రవారం సూరంపూడి సుబ్బమ్మగారింట్లో అందరం లలిత సహస్రనామ జపం కోసం వెళ్లాంగా అక్కడ కారంచేడు కనకదుర్గ చెప్పింది" అంది.

అమెరికా వెళ్ళొచ్చాక మంగమ్మగారు క్రొత్తగా ప్రతీవాళ్లనూ వాళ్ళ ఇంటి పేరుతోసహ చెప్పడం అలవాటు చేసుకుంది.

"ఇంతకీ ఏమంటావు" పేపరు పక్కన పడేసారు మంగపతి ఓటమిని అంగీకరిస్తూ.

"ఇవాళ సాయంత్రం మనం బజారుకెళ్లి 'మైక్రో ఓవెన్' తెచ్చుకుంటున్నాం. అంతే" సుప్రీం కోర్టు తీర్పు చెప్పినంత ఖచ్చితంగా చెప్పేసింది మంగమ్మగారు.

అసలు అమెరికా నుండి తిరిగి వస్తున్నప్పుడు అది తెచ్చుకోవాలని సరదా పడిందావిడ. దానిమీద టాక్సు అదీ కలిపి బోలెడు ఖరీదు అవుతుందనీ, అంతకన్నా చవుకగా ఇండియాలోనే దొరుకుతున్నాయని నచ్చచెప్పి అక్కడికి గట్టెక్కాడాయన. ఇప్పుడు కాదు కూడదనుకుంటే ఫోనులో కూతుళ్లకు ఫిర్యాదు చేస్తుందావిడ. వాళ్ళు ముగ్గురూ తల్లి పక్షమే.

అన్నీ ఆలోచించి "అలాగే కొందాంలేగానీ నాకు ఇంకో కప్పు కాఫీ ఇవ్వవోయ్" అన్నారు మంగపతిగారు.

ఆ సాయంత్రం ఇద్దరూ బజారుకు వెళ్లి మంగమ్మగారి కలను సాకారం చేస్తూ మైక్రోవేవ్ ఆవెన్‌ను తెచ్చుకున్నారు.

ఇంటికి వచ్చి ఆవెన్‌ను ఇన్‌స్టాల్ చేసిన షాపు అసిస్టెంట్ "ఏం వేడి చేస్తారో తీసుకురండమ్మా" అన్నాడు.

"ముందుగా పాలు కాచడం శుభసూచకం" అంటూ పాలు పట్టుకువచ్చింది మంగమ్మగారు.

"మైక్రోవేవ్‌లో పెట్టడానికి ప్రత్యేకమైన గిన్నెలో పోసి తెండమ్మా" అన్నాడతను.

"అయ్యో అట్లాంటి గిన్నెలు తెచ్చుకోలేదే అమెరికా నుండి" అంటూ నొచ్చుకుంది మంగమ్మ గారు.

"అవి మా షాపులో వున్నాయిలేమ్మా. ఇప్పటికి అదిగో ఆ 'లా ఓపెలా' కప్పులో పోసి పెట్టండి ఓవన్‌లో" అన్నాడా అబ్బాయి.

పాలు కాగాక వేడి వేడి పాలు వెంకటేశ్వరస్వామికి నివేదన చేసింది మంగమ్మ.

"మనం రేపు ప్రొద్దున్నే వెళ్లి ఆ గిన్నెలేవో కొనుక్కు వద్దాం" అంది ఆ రాత్రి పడుకోబోయేముందు.

అనుకున్నట్లుగానే ఉదయం బజారుకు వెళ్లడం కోసం తొందరగా వంట చేసేసింది మంగమ్మగారు. తీరా వెళ్లాక ఆ గిన్నెల ఖరీదు చూసి ఆవిడకు మైక్రో ఓవెన్ వేడి తెలిసినట్టయింది. ఎనిమిదివేలు మైక్రోవేవ్ ఓవెన్‌కు పెట్టినప్పుడు కలగని బాధ ఎనిమిది వందలు పెట్టి రెండు గాజుగిన్నెలు కొంటున్నప్పుడు తెలిసిందావిడకు.

"పోనీలేవే. దానిమీద వచ్చిన డిస్కౌంటు డబ్బు వీటికి పెట్టామనుకుంటే సరి" అని ఓదార్చారు మంగపతిగారు.

వాళ్ళు ఇంటికి చేరేసరికి ఒంటిగంట కావొచ్చింది. రాగానే భోజనానికి సిద్ధం చేయడానికి వంటింట్లోకి వెళ్లిన మంగమ్మగారు గబగబా బయటకు వచ్చి "ఏవండీ! అన్నం, కూరలు అన్నీ చప్పగా చల్లారిపోయాయండీ" అంది సంతోషంగా.

"తెల్లవారుఝామునే వండి పెడితే చల్లారక ఛస్తాయా? అందుకంత సంతోషం దేనికి?" చిరాకు పడ్డారు మంగపతిగారు.

"అదే మీతో వచ్చిన తంటా, ఏదీ మీ అంతట మీకు తోచదు. ఇదివరకైతే వంటలు చల్లారిపోతే అయ్యో వేడిగా లేకపోతే ఈయనకు నచ్చదే అని దిగులు పడేదాన్ని ఇప్పుడు మనింట్లో మైక్రోవేవ్ వుందిగా, ఆ గిన్నెల్లో వేసి అందులో పెడితే క్షణాల్లో వేడి వేడి భోజనం రెడీ" అంది ఆనందంగా ఆవిడ టీవీ యాంకర్లా.

"అయితే రేపటి నుండి పొద్దున్నే ఆరింటికే వంట వండి పెట్టేస్తావా ఏమిటే?" అనడిగాడాయన భయంగా.

"ఇలాంటి కుళ్ళు జోకులే నాకు నచ్చవు. ముందు భోజనానికి రండి. భోజనాలు అయ్యాక కాసేపు పడుకుని లేస్తే ఆ ఫైవ్ స్టార్ వంటాయన పుస్తకంలో నుండి ఏదన్నా వంటకం తయారుచేద్దాం" అంది మంగమ్మగారు.

"అంటే నేను కూడా చేయాలా?" హడిలిపోతూ అడిగారు మంగపతిగారు.

"ఏం? అమెరికాలో అయితే అమ్మాయి గిన్నెలు కడిగిస్తూ వుంటే అల్లుడు డిష్‌వాషర్‌లో పెడుతుంటే ముచ్చట పడుతూ చూసారుగా. ఇక్కడ మనం మాత్రం అలా ఉండకూడదా ఏం? ఆ ఇంగ్లీషు పుస్తకంలో ఏం రాసాడో మీరు చదివి చెప్తుంటే నేను తయారు చేస్తాను" ధీమాగా అంది మంగమ్మగారు.

"అలాగే" అంటూ మద్దెల దరువు వేసే విద్వాంసుడు తల ఊపినట్లు తల ఊపారు మంగపతిగారు.

ఇద్దరి భోజనాలు అయిపోయాక గిన్నెలో సగంపైగా మిగిలిన సాంబారూ, మరో గిన్నెడు కూరా చూసి "ఇవాళేమిటి ఇంతమందికి వండావు? పిల్లలు ముగ్గురూ మన దగ్గరే వున్నారని భ్రమపడ్డావా ఏమిటి?" అంటూ ఆశ్చర్యపడ్డాయన.

మామూలుగా అయితే ఆవిడ ఏ పూటకి ఆ పూట వేడిగా వండుతుంది.

అందుకే అడిగాడు.

"భలేవారే. ఇంట్లో మైక్రోవేవ్ పెట్టుకుని ఇంకా పూట పూట వండుకోవడం దేనికండి? ఆమెరికాలో చూడలేదూ ముందురోజు రాత్రే మర్నాటికి వండి పెట్టేస్తారు మన పిల్లలు" మైక్రోవేవ్ వైపు ప్రేమగా చూస్తూ అన్నది మంగమ్మగారు.

"పైగా ఇవాళ శనివారం కూడా, మనం రాత్రి భోజనం చేయముకదా, అయితే వాళ్ళు ముందు రోజు రాత్రి వండి పెట్టేస్తారని నువ్వు ముందు రోజు పొద్దున్నే వండేశావన్నమాట రేపటికి. సెభాష్, కానీ నేను రిటైరైపోయాను. నువ్వు ఉద్యోగం చేయవుకదా, పోనీ మనిద్దరం ఏదైనా ఉద్యోగాల్లో చేరదామా?" మంగపతిగారు వస్తున్న నవ్వు దాచుకుంటూ అడిగారు.

"అదిగో అలా ఎద్దేవా చేయడమే నచ్చదు నాకు. ఉద్యోగం చేయకపోతే మాత్రం ఒక పూట వంటా వార్పూ గొడవ లేకుండా హాయిగా ఉండకూడదా ఏమిటి?" సమర్థించుకుంటూ అన్నారు మంగమ్మగారు.

"సరే. నీ ముచ్చటా తీరనీ" భోజనం ముగించి చెయ్యి కడుక్కున్నారు మంగపతిగారు.

"ఇదిగో తొందరగా ఆ కోడి కునుకు తీసి లేవండి చెప్పానుగా ఆ టోపీ వంటాయన చెప్పిన వంటలు చేసి చూద్దామని" గుర్తు చేసింది ఆవిడ.

"అలాగే... అలాగే.." అంటూ మళ్లీ మద్దెల దరువు వేసే వాడిలా తల గుండ్రంగా తిప్పారు మంగపతిగారు.

మంగపతి మధ్యాహ్నం నిద్ర ముగించి వచ్చేసరికి వేడిగా టీ అందించి వంటలు పుస్తకం పట్టుకు వచ్చింది మంగమ్మగారు.

ఆయన టీ త్రాగడం ముగించి పుస్తకం తీసుకుని పేజీలు తిప్పాడు.

"ఇంతకీ ఏదో రెండు వంటకాలు చదవండి చేస్తాను" అందావిడ అసహనంగా.

"ఇదిగో విను మరి. సూప్స్‌లో మొదట ఇచ్చింది చికెన్ షోర్బా. కావాల్సిన వస్తువులు బోన్ లెస్ చికెన్ వందగ్రాములు" అంటూ ఆయన చదువుకుపోయారు.

"అబ్బా... రామరామ ఆపండి. ఆ సూపులూ అవీ వద్దులెండి. మరొకటి చూడండి" అంది అసలుసిసలు వెజిటేరియన్ మంగమ్మగారు.

"సరే అయితే పెపర్ ప్రాన్స్ చదవనా? స్మోకీ ఫిష్ కబాబ్ చేస్తావా?" సీరియస్‌గా పేజీలు తిప్పుతూ అడిగారు మంగపతిగారు.

"ఏం తమాషాగా వుందా మీకు? అన్నీ చేపలు, కోళ్ళు తప్ప శాకాహారం వంటలే లేవా?" అంది చిరాగ్గా.

"లేకేం? కాలీఫ్లవర్ అండ్ బ్రోకలి ఇన్ స్పైస్డ్ అల్మండ్ సాసట. ప్రయత్నిస్తావా? బ్రోకొలి, వైట్‌సాస్, అల్మండ్స్, డ్రైడ్ మిక్సెడ్ హెర్బ్స్ వున్నాయా? అది కాదంటే బాదామీ బేబీ కార్న్ పనీర్ మసాలా చేస్తావా?' కంటికి నదురుగా కనబడిన వంటలు చదివారు మంగపతిగారు.

"మీకంతా వేళాకోళంగా వున్నట్టుంది. అసలు ఈ పుస్తకం చూసి ఎవరు వండుతారు? మన అమ్మాయిలు ఇవన్నీ వండుతున్నారా ఏం?" అంటూ పుస్తకం లాక్కుని టేబుల్ సొరుగులో పడేసింది.

"సరేగాని సాయంకాలం ఒక అరకేజీ మంచి స్వీట్స్ పట్టుకురండి మరిచిపోకుండా" అని ఆజ్ఞ జారీ చేసింది.

"అదేమిటే? మనిద్దరం సుగర్ బార్డర్ లైన్లో వున్నామనీ, స్వీట్సు అస్సలు తినొద్దని చెప్పాడుగా డాక్టరు?" మంగపతిగారు ఆశ్చర్యంగా అడిగారు.

"మీకు పెట్టను. నేను తినను సరేనా? ఫ్రిజ్‌లో పడేసి వుంచితే ఎన్నాళ్లయినా వుంటాయి. ఎవరైనా వచ్చినప్పుడు మైక్రోవేవ్‌లో వేడి చేసి ఇవ్వొచ్చు" అంది మంగమ్మగారు.

"అది మైక్రో ఓవెన్ కాదు, మైక్రోవేవ్ కాదే మైక్రోవేవ్ ఆవెన్. ముందు సరిగ్గా పలకడం నేర్చుకో. ఇంకో మాట. రెండ్రోజుల ముందు వండిన వంట మైక్రోవేవ్ ఆవెన్‌లో వేడి చేసి నాకు పెట్టనని మాట ఇస్తే స్వీట్లు, ఐస్‌క్రీమ్, పావ్‌బాజీ ఏది కావలిస్తే అది తెచ్చిస్తాను. నీ సరదా తీరేట్టు వేడి చేసుకో" నీరసంగా అన్నారు మంగపతిగారు.

"మరీ చిత్రంగా మాట్లాడకండి. మన లీడర్లు మనల్ని రెండువేల ఇరవైలోకి నడిపిస్తానంటుటే మీలాంటి అభివృద్ధి నిరోధకులు మమ్మల్ని రాతి యుగంలోకి నడిపించాలని చూస్తున్నారు."

చీరకొంగు నడుము చుట్టూ చుట్టి గంభీరంగా మాట్లాడుతున్న మంగమ్మ గారినీ, అవాక్కై వింటున్న మంగపతినీ గంభీరంగా చూస్తోంది మంగమ్మగారి 'మైక్రో ఆవెన్'!

ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక
తేది : జూలై, 2004.